

గూడూరులో మత్తు పదార్థాల కలకలం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

స్థానిక ఆసుపత్రిరోడ్డులోని ఓ మందుల దుకాణంలో గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత మత్తుపదార్థాలను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం రాత్రి పోలీసులు ఆ దుకాణంపై దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన చోటుచేసుకుంది. విచారణ చేపడుతున్నామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు. ఈ సంఘటన వెలుగుచూడడంతో పట్టణంలో గురువారం కలకలంగా నెలకొంది.

వీడని 'విలీన' వ్యథ

విద్యకు దూరంగా పేద విద్యార్థులు
కేసులు పెడతామంటూ బెదిరింపులు
వెయ్యిమందిపైనే 'బడికి దూరంగా..'

మొండిగా వ్యవహరిస్తున్న సర్కారు
'తగ్గేదేలే' అంటున్న తల్లిదండ్రులు
విద్యాశాఖపై 'ప్రజాసంఘాల'ఆగ్రహం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆదర్శ పాఠశాలల పేరిట చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ బడుల విలీనప్రక్రియ నిరుపేద విద్యార్థులను చదువుకు దూరం చేసింది. విలీనానికి తాము దూరమన్న బడులపై విద్యాశాఖ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వందలాదిమంది విద్యార్థులు బడిబయటే నిరీక్షించాల్సి వస్తోంది. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయడంతో పాటు ఊరి బడికి ఉరి వేసేలా గత జగన్ ప్రభుత్వం అమలు చేసిన జీవో 117ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఆ జీవోను తలదన్నేలా 'మోడల్ స్కూల్స్' పేరిట బడులను విలీనం చేస్తూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మూతవేసేట్లు చేస్తోంది. విలీన ప్రక్రియ కార్యక్రమ బాధ్యతను ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులపై పెట్టారు. 'ఏమైనా చేసుకోండి.. బుజ్జగించండి .. బతిమలాడండి.. అంతిమంగా తల్లిదండ్రులను ఒప్పించి విలీనానికి అనుకూలంగా తీర్మానాలు చేసి పంపాలి' అంటూ ఎంఇఒలు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసేశారు. ఆ మేరకు అధికారులు తగ్గేదేలే అంటూ తిరుపతి జిల్లా వ్యాప్తంగా విలీన ప్రక్రియ దాదాపు పూర్తి చేయగా.. తూర్పు మండలాల్లో మాత్రం విలీనానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు తామూ తగ్గేది లే అంటూ ఆందోళనలు చేస్తుండడం గమనార్హం.

విద్యకు దూరంగా పేద విద్యార్థులు

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 1844 ప్రాథమిక పాఠశాలలు, 188 ప్రాథమికోన్నత, 322 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 94,178 మంది, ప్రాథమికోన్నతలో 57,801 మంది, ఉన్నత పాఠశాలల్లో 35,465 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో 4,784, ప్రాథమికోన్నతలో 5,678, ఉన్నత పాఠశాలల్లో 7,415 మొత్తం 17,877 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న తరగతుల విలీనం వల్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయే పరిస్థితి ఏర్పడింది. మరీ ముఖ్యంగా పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. 3, 4, 5 తరగతులను కిలోమీటర్ల అవతల ఉన్న పాఠశాలలకు పంపడం వల్ల అక్కడ 1, 2 తరగతులే మిగులుతున్నాయి. దీంతో 1, 2 తరగతుల విద్యార్థుల సంఖ్య 10 నుంచి 15 లోపే ఉండటంతో అవి ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగులుతున్నాయి. దీంతో ఆ పాఠశాలలకు పంపేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. మరోపక్క తల్లికి వందనం పథకాలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకూ అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అమాంతంగా పడిపోతోంది. తరగతుల విలీనంతో దూరంగా ఉన్న పాఠశాలలకు తల్లిదండ్రులు పంపలేకపోతున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వేడాం మిట్టకండ్రిగ, వేడాం, పల్లంపేట ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులను మరో చోట విలీనం చేయడంతో గత రెండు నెలలుగా అక్కడి విద్యార్థులు బడులకు వెళ్లడం లేదు. చదువుకు దూరంగానే ఉంటున్నారు. ఈ తరహా సమస్య తూర్పు మండలాల్లోని చాలా గ్రామాల్లో ఉంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు విలీన ప్రక్రియ కారణంగా బడిబయటే ఉన్నట్లు సమాచారం.

కేసులు పెడతామంటూ బెదిరింపులు

ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియపై జిల్లాలోని తూర్పు మండలాల్లో పెద్ద ఎత్తున విద్యార్థుల తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 44 ప్రాథమిక పాఠశాలల్లో విలీన ప్రక్రియకు వ్యతిరేకంగా తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌కు తీర్మానాలు పంపారు. విలీనం ఆగుతుందని అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి తప్ప, అధికారికంగా రాలేదు. దీంతో చదువులపై తల్లిదండ్రులు మరింత ఆందోళనకు దిగుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే పల్లంపేట ప్రాథమిక పాఠశాలకు గ్రామస్తులు తాళాలు వేశారు. దీంతో పది రోజులుగా ఉపాధ్యాయులు బడిబయటే ఉంటున్నారు. దీన్ని పై స్పందించిన డిఇఓ గ్రామస్తులపై కేసు పెట్టాలంటూ ఏర్పేడు మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

'నేతన్న'ను ప్రోత్సహిద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - వెంకటగిరి

జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని వెంకటగిరి నియోజకవర్గ ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ, చేనేత కార్మికులతో కలిసి వెంకటగిరి క్రాస్‌రోడ్డు కూడలి నుంచరి త్రిభువన్ సర్కిల్ వరకూ నిర్వహించిన ర్యాలీలో ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనం చేసి పద్మశాలి కల్యాణ మండపంలో చేనేత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 5,712 మంది చేనేత కార్మికులకు నెలకు 4వేల చొప్పున ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తున్నామన్నారు. నేటినుంచి చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్‌లూం కార్మికులకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితం అన్నారు. తిరుపతి జిల్లాలో దాదాపు 6వేల పైన చేనేత కుటుంబాలు ఉన్నాయని, ముఖ్యంగా వెంకటగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, నారాయణవనంలో ఉన్నారన్నారు. వెంకటగిరి పట్టు, కాటన్‌చీరలు, జన్దారీ చీరలు ప్రసిద్ధిగాంచాయన్నారు. నారాయణవనం పెళ్లిపట్టు చీరలు, పుత్తూరు టవల్స్, ధోతీలు ప్రసిద్ధిచెందాయన్నారు. వెంకటగిరి నందు కోటి యాభై రెండు లక్షలతో 182 చేనేత కార్మికులతో పోలేరమ్మ చేనేత క్లస్టర్, శ్రీకాళహస్తి నందు 191 మందితో 90 లక్షలతో శ్రీకాళహస్తీస్వర స్మాల్ క్లస్టర్, నారాయణవనంలో 171 మంది కార్మికులతో కోటి రూపాయలతో నారాయణవనం స్మాల్ క్లస్టర్ మంజూరు కాబడిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ ఏడి రమేష్, ఎల్‌డిఎం గుంటూర్ రవికుమార్, చేనేత సంఘ నాయకులు గంగాధర్, విశ్వనాధన్, లక్ష్మీపతి, సత్యనారాయణ, రాజేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో 'హ్యాండ్లూమ్ పవర్‌వాక్'

ప్రజాశక్తి - క్యాంపస్

జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో ఎన్ఎస్ఎస్ బ్యూరో, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆద్వర్యంలో 'హ్యాండ్లూమ్ పవర్‌వాక్' నిర్వహించారు. ఉపకులపతి ప్రొఫెసర్ వి.ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని మాట్లాడుతూ భారతదేశపు సంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే చేనేత పరిశ్రమను పరిరక్షించడం, ప్రోత్సహించడం అందరి బాధ్యతని అన్నారు. 2025, ఆగస్టు నుంచి ప్రతి నెలా ఏడో తేదీన చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా చేనేత కార్మికులకు మద్దతుగా ఉండాలని అధ్యాపకులను ప్రోత్సహించారు. చేనేత వస్త్రాలను ధరించే ప్రతిజ్ఞను చేయించారు. చీరలు, దుస్తులు, శాలువాలు మొదలైన సంప్రదాయ చేనేత వస్త్రాలతో విశ్వ విద్యాలయ వాతావరణం భారతీయ సంప్రదాయ సౌందర్యంతో అలరారింది. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఐవి. లలితాకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. పి. మాధవి, డా. వై. అనిత, డా. బి. విశాలిపాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

భారతీయ సాంస్కృతిక వారసత్వానికి వన్నె తెచ్చిన చేనేతలకు అసలైన నేస్తం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు కొనియాడారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై 5 శాతం మేర జీఎస్టీ మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు మంజూరు పథకాలకు శ్రీకారం చుట్టిన సందర్భంగా పద్మశాలి పేట, కుందేటివారి వీధిలో గురువారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే క్రమంలో ప్రభుత్వంపై రూ.190 కోట్ల భారం పడినా ముందుకు వెళ్లడంపై ఉమేష్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, మిన్నల్ రవి తదితరులు పాల్గొన్నారు.

క్యాబినెట్లో 'శెట్టిపల్లి' చర్చే లేదు : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'క్యాబినెట్ సమావేశంలో 'శెట్టిపల్లి' భూ సమస్యను చర్చించి, న్యాయం చేస్తా' అని తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి చెప్పినా, ఏమాత్రం చర్చ జరగలేదని, జీవో మార్పు చేయలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత 15ఏళ్లుగా శెట్టిపల్లి భూబాధితులు సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారని, జీవో మార్పు చేసి న్యాయం చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పదేపదే సమస్య పరిష్కరిస్తామని మాయమాటలు చెప్పడం తప్ప, ఆచరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నాలుగో తేదీ తుడా కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలోనూ క్యాబినెట్‌లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్పొరేట్లకు ప్రజల భూములను అప్పగించడంపై ఉన్న శ్రద్ధ, శెట్టిపల్లి పేదల సమస్యను పరిష్కరించడంలో లేదన్నారు. రానున్న కాలంలో భూబాధితులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

టిటిడిలో ఉద్యోగోన్నతి ఎందుకు లేదు : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ పాయింట్‌లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, దీర్ఘకాలంగా ఉద్యోగులకు ప్రమోషన్లు నిలిపేయడం అర్థం లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో ప్రశ్నించారు. గత ఐదేళ్లుగా ఉద్యోగోన్నతి కల్పించకపోవడం వల్ల, దాదాపు వంద మందిపైనే ఉద్యోగోన్నతి లేకనే రిటైరయ్యారని గుర్తు చేశారు. వందమంది పైనే కారుణ్య నియామకాలకు ఎదురుచూస్తున్నారన్నారు. డిగ్రీ, పీజీలు చేసిన వారిని కారుణ్య నియామకాల కింద నాలుగో తరగతి ఉద్యోగులుగా రిక్రూట్ చేసుకుంటున్నారని, అయితే టిటిడిలో ప్రమోషన్లు ఇవ్వని కారణంగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ ఏర్పడలేదన్నారు. పదోన్నతి లేక అటెండర్లు, అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఎఇఒలు, డిప్యూటీ ఈవోలు ప్రమోషన్లకై ఏళ్ల తరబడి వేచి ఉన్నారని గుర్తు చేశారు. ఉద్యోగులు నష్టపోకుండా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు.

డాక్టర్ స్వామినాథన్ సేవలు మరువలేం : వ్యకాసం

ప్రజాశక్తి - సత్యవేడు

హరిత విప్లవ పితామహుడు, శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సేవలు మరువలేమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ అన్నారు. సత్యవేడు కార్యాలయంలో స్వామినాథన్ జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఆహార ధాన్యాలకు కొరత ఏర్పడి కరువు కాటకాలతో అల్లాడుతున్న దశలో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ పరిశోధనలను తన మాతృదేశమైన భారతదేశానికి అవసరమని భావించి స్వదేశానికి వచ్చి నూతన వంగడాలు సృష్టించి అధిక పంట ఉత్పత్తి చేశారన్నారు. అయితే ప్రస్తుత పాలకులు విదేశాల నుంచి ఆహార ధాన్యాలు, వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నారన్నారు. దేశంలో చెరకు పంట ఉత్పత్తిలో ప్రథమస్థానంలోనూ, ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంటే, నేటి పాలకులు విదేశాల నుంచి చక్కెర దిగుమతి చేసుకోవడం సిగ్గుచేటన్నారు. వేరుశనగ ఉత్పత్తిలోనూ ప్రథమ స్థానంలో ఉన్నా, బయట దేశాల నుంచి పామాయిల్, సన్‌ఫ్లవర్ దిగుమతి చేసుకుంటున్నారన్నారు.

'ఫీమేల్' యాత్రికులకు 'ఫ్రీ' లేదు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎన్నికల హామీలో భాగంగా 'స్త్రీ శక్తి' పథకం రాష్ట్రవ్యాప్తంగా కొన్ని బస్సుల్లో వర్తిస్తున్నా, తిరుమల- తిరుపతి మధ్య సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌ల్లో ఉచిత ప్రయాణం లేదని రాష్ట్ర ప్రభుత్వం తేల్చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ విజయనగరం పర్యటనలో భాగంగా అధికారికంగా వెల్లడించారు. తిరుమల తిరుపతి మధ్య రోజుకు ఎక్స్‌ప్రెస్‌లు, సప్తగిరి ఎక్స్‌ప్రెస్‌లు, ఎలక్ట్రికల్ బస్సులన్నీ కలిపి 500 బస్సులు తిరుగుతున్నాయి. ప్రభుత్వం పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఏ బస్సు ఎక్కినా ఉచితమేనని ప్రకటించింది. అయితే తిరుపతి-తిరుమల మధ్య తిరిగేవన్నీ ఎక్స్‌ప్రెస్ బస్సులే. ఈ బస్సుల్లో మాత్రం ఉచితం లేదని ఛైర్మన్ ప్రకటనలతో తేల్చేశారు. తిరుపతి రీజియన్ పరిధిలో అలిపిరి, తిరుపతి, మంగళం, తిరుమల, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట డిపోల పరిధిలో 350 ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు మంజూరయ్యాయి. ఇందులో అలిపిరి డిపోకు 50 బస్సులు చేరుకున్నాయి. త్వరలోనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మిగిలిన 300 బస్సులు సెప్టెంబర్ మొదటివారంలో ఆయా డిపోలకు చేరుకోనున్నాయి. నెల్లూరు-తిరుపతి, కడప-తిరుపతి, మదనపల్లి - తిరుపతి, చిత్తూరు - తిరుపతి, చెన్నయ్ - తిరుపతి మీదుగా ఈ సర్వీసులు ఎక్కువగా నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో ఎక్కువభాగం తిరుమలకూ సేవలందించనున్నాయి. తిరుమల సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ఈ బస్సులకు సంబంధించిన ఛార్జింగ్ పాయింట్లు తక్కువగా ఉండడంతో, బస్సుల సంఖ్య రీత్యా ఆయా డిపోల పరిధిలోనే ఇవి ఛార్జింగ్ పెట్టుకుని తిరుమల వెళ్లనున్నాయి. అయితే తిరుపతి - తిరుమల మధ్య మాత్రం మహిళా ప్యాసింజర్లకు ఉచితం లేదు.

'తిరుపతి-తిరుమల' మధ్య 'స్త్రీశక్తి' నైనై

'కుంకీ'కి సంగటి

50 ఎకరాల్లో 'ఆహార' పంటలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జనావాసాల్లోకి వచ్చి పంటలను ధ్వంసం చేయడమే కాకుండా, మనుష్యుల ప్రాణాలను గాల్లో కలిపేస్తున్న ఏనుగులను అటవీ ప్రాంతాల్లోకి తరిమేందుకు బెంగుళూరు నుంచి వచ్చిన 'కుంకీ' ఏనుగులకు 'మెనూ' సిద్ధమవుతోంది. పలమనేరు అటవీ ప్రాంతంలో 50 ఎకరాల్లో ఏనుగులు తినేందుకు వీలైన పంటలను సాగు చేస్తున్నట్లు అటవీ అధికారి వేణుగోపాల్ మీడియాకు తెలిపారు. రంజన్, కృష్ణా, దేవ, అభిమన్యు కుంకీ ఏనుగులను కర్నాటక నుంచి తీసుకొచ్చారు. ఏపీకి చెందిన వినాయక్, జయంతులను చిత్తూరు జిల్లా పలమనేరు మండలం ముసలిమడుగు ఏనుగుల శిబిరంలో ఉంచారు. ఈ కుంకీల వ్యవహారం, దినచర్య ఎలా ఉందనేది పరిశీలిస్తే ఒక్కో కుంకీ ఏనుగు ఉదయం 6 గంటలకు 350 గ్రాముల బెల్లం, ఏడు గంటలకు వరి కంకులు, 8.30 గంటలకు శిక్షణ ఉంటుంది. శిక్షకుడు చెప్పిన విషయాలు అవగాహన చేసుకుంటేనే పచ్చగడ్డి, రావి, జువ్వి, అత్తి, మర్రి, అరటిబోదలను ఆహారంగా 50 కిలోలు తింటాయి. ఉదయం 9 గంటలకు నీరు తాగిన తరువాత 10 గంటలకు రాగి ముద్ద పెడతారు. అప్పటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ అడవిలో నడకతో పాటు, మేత కూడా ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు స్నానం చేయించి 5.30 గంటలకు రాగిముద్దలు అందించి, నీరు తాగిస్తారు.

6.30 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ వరికంకులు, రాగి ఆకులు, అరటిబోదలు, గడ్డి తింటూ నిద్రపోతాయి. ఇలా ఒక్కో ఏనుగు 17-18 గంటలు తింటూనే ఉంటాయన్నమాట. ప్రతి కుంకీ ఆహారానికి రోజుకు 3వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఈ ఏనుగుల పర్యవేక్షణకు 30 మంది సిబ్బందిని కేటాయించారు.

భూమన హయాంలో టిటిడిలో ఎన్నో అపచారాలు : ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

భూమన హయాంలో టిటిడిలో ఎన్నో అపచారాలు, అక్రమాలు జరిగాయన్నారు. భూమన టిటిడి ఛైర్మన్ గా ఉన్నప్పుడు కల్తీ నెయ్యితో లడ్డూను, అన్నప్రసాదాలను తయారు చేశారని గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక ఎన్జీవో కాలనీలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ టిటిడిలో అక్రమంగా సంపాందిన డబ్బుల్లో సగాన్ని జగన్ కు పంపించారన్నారు. బి.ఆర్.నాయుడు టిటిడిలో ఎన్నో మార్పులు తీసుకువస్తున్నారని ఆరణి స్పష్టం చేశారు. మంచి వ్యక్తిని టిటిడి ఛైర్మన్ గా సిఎం చంద్రబాబు నియమించారన్నారు. ధర్మారెడ్డి తిరుమలలో సర్వం తానై వ్యవహరించాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిటిడిలో ఇప్పటి వరకు ఎలాంటి అపచారం జరగలేదన్నారు. ప్రస్తుతం సామాన్య భక్తులకు తిరుమలలో త్వరితగతిన దర్శనభాగ్యం లభిస్తోందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తున్నామని, భూమన కరుణాకర్ రెడ్డి, భూమన అభినయరెడ్డిలే అతి పెద్ద దళారీలుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శ్రీవారి టిక్కెట్లు అక్రమంగా విక్రయించలేదని భూమన ప్రమాణం చేయగలరా అని ఎమ్మెల్యే ఆరణి ప్రశ్నించారు. ఎఐ టెక్నాలజీతో సామాన్య భక్తులను శ్రీవారి చెంతకు చేర్చే ప్రయత్నాన్ని స్వాగతిస్తున్నామన్నారు. భూమన మాటలను ప్రజలు నమ్మడం లేదని, భూమన త్వరలో జైలుకెళ్ళడం ఖాయం అన్నారు.

స్విమ్స్‌లో రెండు సంక్లిష్ట శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సి.టి. సర్జరి విభాగంలో సంక్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించారని స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప జిల్లా బద్వేల్ మండలం బాలయ్యపల్లి గ్రామానికి చెందిన సుంకర రత్నం (26) పేషంట్ ఆయాసంతో బాధపడుతూ దగ్గితే రక్తం పడుతూ ఉండేదని, సీరియస్ కండిషన్లో స్విమ్స్‌లో చేరగా, గుండెలో పెద్ద గడ్డ ఉందని, దీనివల్ల ఊపిరితిత్తుల రక్తనాళాలు మూసుపోయాయని నిర్ధారించి గుండెల్లో ఉన్న గడ్డను తొలగించి, బ్లాక్ అయిన రక్తనాళాలను క్లియర్ చేశామని, ప్రస్తుతం కోలుకుని డిశ్చార్జి అయ్యారని తెలిపారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వైఎస్ఆర్ కాలనీ కొల్లబైలు గ్రామానికి చెందిన ముడివేడు సోమశేఖర్ (50) గుండె సమస్యతో మదనపల్లి, హైదరాబాద్ ఆస్పత్రుల్లో చూపించినా ఆపరేషన్ చేయలేమని చెప్పడంతో స్విమ్స్‌కు రిఫర్ చేశారని, గుండెలో నాలుగు కవాటాలు డ్యామేజి కావడంతో ఆపరేషన్ ద్వారా రెండు కవాటాలు మార్చి, మరో రెండు బాగు చేశామన్నారు. ఇది అరుదైన క్లిష్టమైన ఆపరేషన్ అని తెలిపారు. ఈ ఆపరేషన్లను స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆవి కుమార్ నేతృత్వంలో డాక్టర్ సత్యవతి, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ అలోక్ సమంత్‌రే చేశారు.

అక్రమ దందాపై ఆర్డీవోను నిలదీసిన కిలివేటి

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక, గ్రావెల్ పక్క రాష్ట్రాలకు, లే అవుట్లకు పట్టపగలే సరఫరా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు.మట్టి మాఫియా బరితెగించి పట్టపగలే ఇసుక, మట్టి తరలిస్తున్న కట్టడి చేయాల్సిన రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫోన్ చేసి తెలిపినా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఆర్డీవో స్పందించకపోతే రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని, ఆర్డిఓ ఆఫీస్ ముందే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

గిరిజన యువకునిపై దాష్టీకం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

వాహనాలను అద్దెకు ఇచ్చే వడ్డీవ్యాపారి అద్దె చెల్లించలేదన్న కోపంతో గిరిజన యువకుని చావబాదిన వైనం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరుపతికి చెందిన వడ్డీవ్యాపారి అనిల్ రెడ్డి ద్విచక్ర వాహనాలను అద్దెకు ఇచ్చే షాపును నిర్వహిస్తున్నాడు. అతని వద్ద గిరిజనుడైన పవన్ నెల రోజుల క్రితం ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకున్నాడు. ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకున్న బాధితుడు పవన్. అద్దె చెల్లించకుండా వాహనాన్ని కుదవ పెట్టి కనుమరుగయ్యాడు. అప్పటి నుంచి అతని కోసం వెతుకులాట ప్రారంభించారు. ఎట్టకేలకు పవన్ చిక్కడంతో ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసం ఎదుట ఉన్న అనిల్ రెడ్డి కార్యాలయానికి తీసుకెళ్లి అతనిపై దాడి చేశాడు. అనిల్ అనుచరులతో పాటు రౌడీషీటర్ దినేష్ రెడ్డి రాడ్‌తో పవన్ పైదాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పవన్ తల్లిదండ్రులకు అనిల్ అనుచరుల ద్వారా ఫోన్ చేసి ఐదు లక్షల రూపాయలు డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో పవన్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు అనిల్ రెడ్డితో పాటు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. రౌడీ షీటర్ దినేష్ రెడ్డి కోసం గాలింపు చేపట్టారు. తిరుపతి మాజీ ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డికి అనిల్‌రెడ్డి అనుచరుడు కావడంతో ఈ దాడి రాజకీయ రంగు పులుముకుంది. అనీల్ వైసిపి అని, దినేష్ జనసేన అని రాజకీయ ప్రచారం జరుగుతోంది.

రౌడీషీటర్లను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న తిరుపతి నగరంలో సెటిల్మెంట్లు పేరుతో తిరుపతి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీగ్యాంగులను కఠినంగా శిక్షించాలని సిపిఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఓ గిరిజన యువకుని గదిలో బంధించి రౌడీషీటర్ అనీల్‌రెడ్డి ఫైబర్ కర్రతో పైశాచికంగా కొట్టి, వీడియోలో తీసి మరి సోషల్ మీడియాలో పోస్టు చేశారని, అనీల్‌రెడ్డిని, ఆ దాడిలో పాల్గొన్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు 'రాఖీ' తయారీ శిక్షణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాఖీపండుగ పురస్కరించుకుని వేమన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సావిత్రిబాయి పూలే ట్యూషన్ సెంటర్‌లోని విద్యార్థులకు నెల్లూరి మునిలక్ష్మి ఆధ్వర్యంలో సొంతంగా రాఖీ తయారీ శిక్షణ ఇచ్చారు. సొంతంగా కష్టపడి రాఖీ తయారు చేసి కడితే ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు.

తిరుపతిలో కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సాయి సిల్క్స్ (కళామందిర్) లిమిటెడ్ తమ కార్యకలాపాలను విస్తతం చేయడంలో భాగంగా తమ చీరల బ్రాండ్ కాంచీపురం వర మహాలక్ష్మి సిల్క్స్ ను తిరుపతిలో గురువారం ప్రారంభించింది. తిరుపతి అన్నమయ్య సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన షోరూం ప్రారంభానికి ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకర్త త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, తిరపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ రాజేష్ అన్నం మాట్లాడుతూ తమ సంస్థ 70వ షోరూంను తిరుపతిలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. తమ వద్ద స్వచ్ఛమైన కంచి పట్టు చీరలు, హ్యాండ్లూమ్, బనారస్, పటోల, కోట, పైథాని, కుప్పడం, ప్రీమియం, అన్ని రకాల చీరలు అత్యంత తక్కువ ధరలకు లభిస్తాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి తమిళనాడులో వివిధ బ్రాండ్స్ రూపంలో కార్యకర్తలు నిర్వహిస్తుండగా, తిరుపతిలో ఏర్పాటుచేసిన కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ ఆంధ్రప్రదేశ్లో ఎనిమిదవ షోరూమ్ అని తెలిపారు. కాంచీపురం లో అతి పెద్ద షోరూం కలిగి ఉండడంతో పాటు సొంత మగ్గాలు చేనేత కార్మికులు ఉండడంతో మార్కెట్లో మరెవరు ఇవ్వలేని క్వాలిటీ, ప్రైస్, బ్రాండ్ ఇవ్వగలుగుతున్నామన్నారు. ఇటీవలే సాయి సిల్క్స్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించింది అని తెలిపారు. తమ షో రూమ్ లో అన్ని రకాల చీరలు అందరికీ అందుబాటు ధరలో లభిస్తాయని, మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు శుభాష్, దుర్గారావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నారాయణవనం బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు గురువారం నిర్వహించారు. విద్యార్థులు కొందరికి ఉచితంగా అద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునెయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆస్పత్రి వైద్యులు, నర్సులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి -కోట: పసల కృష్ణయ్య సోదరుడు పసల రమణయ్య కుమారుడు, తెలుగు గంగ ప్రాజెక్టు ఏఈ పసల రాజశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కోట పట్టణంలోని రిడింగ్‌రోడ్‌లో రాజశేఖర్ నివాసంలో సంతాప సభను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా నాయకులు హాజరై అధికారులు రాజశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగుగంగ ఏఈగా పనిచేస్తున్న రాజశేఖర్ అకాల మరణం అందరినీ శోకసంద్రంలో ముంచిందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి, టిటిడి ట్రస్ట్ బోర్డ్ సభ్యులు డాక్టర్ పనబాక లక్ష్మి, టిడిపి నాయకులు డాక్టర్ పసల కృష్ణయ్య దంపతులు, టిడిపి తిరుపతి పార్లమెంట్ కన్వీనర్ నరసింహ యాదవ్, సూళ్లూరుపేట టిడిపి ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆదిశంకర డీమ్డ్ టూ యూనివర్సిటీలో స్టార్టప్, ఇన్నోవేషన్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని ఆదిశంకర డీమ్డ్ టూ యూనివర్సిటీలో అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్, ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో 'స్టార్టప్ డయలాగ్ - భవిష్యత్తును నిర్మించే సంభాషణలు' అంశంపై రెండు రోజుల కార్యక్రమం నిర్వహించారు.

ఇందులో భాగంగా మొదటి రోజు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, రెండవ రోజు విద్యార్థులకు ఇన్నోవేషన్ వర్క్‌షాప్ ద్వారా ఇన్నోవేషన్, స్టార్టప్ అంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్ మెంట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా, స్పీకర్‌గా శశంతం కాసరగడ్డ (ఫౌండర్ అండ్ సీఈఓ, ఫౌండర్స్‌లాబ్ హైదరాబాద్) ఇంటరాక్టివ్ కార్యశాలలు, నెట్‌వర్కింగ్ సెషన్లు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రేరణాత్మక అనుభవాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, డాక్టర్ యమ్ రాజయ్య, డాక్టర్ కె ధనుంజయ, డాక్టర్ టి వేణు మాధవ్, ప్రొఫెసర్ జి ప్రణయ్ కుమార్, డాక్టర్ బి యోగా నరసింహులు నాయుడు, జె రామయ్య (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్స్ పాల్గొన్నారు.

కంభంపాటి హరిబాబును కలిసిన ఎస్వియు అధ్యాపకుడు

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి పర్యటనలో ఉన్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర సాంకేతిక విద్యా కార్యదర్శి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అధ్యాపకుడు డాక్టర్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ హరిబాబు కంభంపాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రముఖ మాజీ ప్రొఫెసర్ గా సుపరిచితులు. ఈ సందర్భంగా ఇటీవల విజయవాడలో నిర్వహించిన జాతీయ సదస్సు గురించి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం గవర్నర్‌కు వివరించారు. ఆ సదస్సులో దేశం నలుమూలల నుండి 1,500 మందికి పైగా విద్యావేత్తలు పాల్గొన్నారని వెల్లడించారు. ఈ జాతీయ సదస్సు ఏబీఆర్ఎస్ఎం న్యూఢిల్లీ జాతీయ జాయింట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గుంట లక్ష్మణ్ నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించబడిందని తెలిపారు.

అక్షరాస్యత పెంపుదలకు కృషి చేయాలి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: స్వయం సహాయక సంఘాల సభ్యులలో అక్షరాస్యతను పెంపుదల చేసి నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల పంచాయతీ రాజ్ విస్తరణ అధికారి శ్రీనివాసులు అన్నారు. గురువారం కార్యాలయంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమంపై మహిళ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలో ప్రతి మహిళకు అక్షరాలు నేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గురుమూర్తి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వాలంటీర్లు, పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా, నిక్షిత్ వికాసం నిపుణులు జెసి ఎం.బాబు, ఎం. బిందు మాధవి వివాహ దినోత్సవ సందర్భంగా వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో ఉన్న రాస్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారని వృద్ధాశ్రమ ఇన్‌చార్జి కరుణాకర్ నాయుడు గురువారం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ రెడ్డి, రాజశేఖర్ నాయుడు, బాబు, విజయ్ కుమార్, శంకర్, శ్రీహరి రెడ్డి, మహేష్ కుమార్, లక్ష్మి, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు కేసులకు చర్యలు తప్పవు: చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జనసేన సంబంధించిన వ్యక్తి తప్పులు చేస్తే వైసిపికి సంబంధించిన సామాజిక మాధ్యమ యాక్టివిస్టు అనిల్ రెడ్డిని నిందితుడిగా పేర్కొంటూ ప్రసార మాధ్యమాలలో చూపించడం బాధాకరమని, తప్పుడు కేసులు పెడితే న్యాయస్థానాల ద్వారా చర్యలు తీసుకోవాలని వైసిపి లీగల్ సెల్ పనిచేస్తుందని వైసిపి లీగల్ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం వైసిపి నాయకులపై తప్పుడు కేసులు పెడితే వైసిపి లీగల్ సెల్ చర్య తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో వైసిపి లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు హరినాథ్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, విజయ్ కుమార్, రాజశేఖర్, శ్రీనివాసులు రెడ్డి, సోమేశ్ రెడ్డి, మహదేవ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ అశోక్ రాజు పేర్కొన్నారు. గురువారం పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో 2025 -26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందిన డిప్లమా బిటెక్ విద్యార్థులకు తల్లిదండ్రులకు ఓరియంటేషన్ అవగాహన కార్యక్రమం. కళాశాల చైర్మన్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాను ప్రకాష్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ప్రారంభం నుండి సాంకేతిక విద్యపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ అశోక్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ఈ సంవత్సంలో సిల్వర్ జూబ్లీ సంవత్సరంలో జాయిన్ అయ్యారని మీరు ఆదర్శంగా నిలవాలన్నారు. స్నేహితులతో ఐక్యతతో విజ్ఞానాన్ని పరస్పరం మార్చుకొని వివా ఇంజనీర్లుగా రాణించాలన్నారు. మొబైల్ ఫోన్ దూరంగా ఉండాలని, లాప్‌టాప్ ద్వారా మంచి ప్రోగ్రాం కోటి నుంచి నేర్చుకుని కంప్యూటర్ యుగంలో డేటా సైన్స్ ఇంటెలిజెన్సీ మిషీన్ లర్నింగ్ క్లౌడ్ కంప్యూటింగ్ తదితర అంశాలపై పట్టు సాధించి మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జనార్ధన్ రాజు మధు ,రమేష్, హెచ్ఓడీ లు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్ల బిగింపును రద్దు చేయాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్, హైస్కూల్ రోడ్డు, బనిక సాహెబ్ పేట, తదితర ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గురువారం కర పత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డును మూడు ముక్కలుగా చేసి (ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం) పేరిట విభజించారని, ఇప్పుడు మళ్లీ విద్యుత్ సంస్థలను మొత్తం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నారన్నారు. అందులో భాగంగానే స్మార్ట్ మీటర్లను తీసుకొచ్చారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెడితే వాటిని బద్దలు కొట్టాలని పిలుపు నిచ్చిన లోకేష్, అధికారంలోకి వచ్చాక విద్యుత్ సంస్కరణ పనులను రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి. రామిరెడ్డి, పామంజి మణి, అడపాల ప్రసాద్, ఎంటేటి చంద్రయ్య, మధు, బి చంద్రయ్య, సుబ్బయ్య , సిరాజ్ , సీపీఐ నాయకులు శశి కుమార్, సివిఆర్ కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న వామపక్షాల నాయకులు

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలి: డీఈవో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లాలో ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డీఈవో కెవిఎన్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్లను ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియలో ఎలాంటి ప్రలోభాలకు తావు ఇవ్వకూడదని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలన్నారు. అడ్మిషన్ల ప్రక్రియలు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధ్యయన కేంద్రాల పరిధిలో రెగ్యులర్ 10, ఇంటర్మీడియట్ లో ఫెయిల్ అయి ఉన్న విద్యార్థుల వివరాలను సేకరించి ఓపెన్ స్కూల్ లో అడ్మిషన్లు పొందేందుకు కృషి చేయాలన్నారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు కూడా రెగ్యులర్ పాఠశాల సర్టిఫికెట్లతో సమానమైనవన్నారు. చదవడానికి, రాయడానికి కనీస పరిజ్ఞానం ఉన్న వారిని అడ్మిషన్ చేసుకోవడం మంచిదన్నారు. అధ్యయన కేంద్రాల సమన్వయకర్తల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి సర్టిఫికెట్లు ఇంకా కొంతమందికి రాలేదని సమన్వయకర్తలు సమావేశంలో చర్చించారు. ఓపెన్ స్కూల్ పరీక్షల సమయంలో మరి ఇతర పరీక్షలు నిర్వహించకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ సమన్వయకర్త నరసింహారావు, జిల్లా కోఆర్డినేటర్ గురుస్వామి రెడ్డి పాల్గొన్నారు.

వాల్ పోస్టరును ఆవిష్కరిస్తున్న డీఈవో

మూలకోనలో కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం ప్రారంభం

కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఫారెస్ట్ రేంజ్ అధికారిణి మాధవి ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని గోపాలకృష్ణాపురం పంచాయతీలో మూలకోనలో విహార యాత్రకు వెళ్లేవారికి ఏర్పాటు చేసిన కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజంను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు అటవీ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజంను ఎమ్మెల్యే ప్రారంభించారు. మూలకోన వాటర్ పాల్స్ సమీపంలో తనిఖీ చెక్ పాయింట్ ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. మూలకోన పర్యాటక కేంద్రంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టిడిపి రూరల్ మండలం అధ్యక్షుడు బాలాజీ, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని సంప్రదాయ వస్త్రధారణ చేనేత వస్త్రాల ప్రాముఖ్యం అనే అంశంపై ఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివప్రసాద్ మాట్లాడుతూ చేనేత రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన మద్దతును అందిస్తుందని, మహిళా సాధికారతకు దోహదపడుతుందన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో కళాశాలకు హాజరైన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకురాలు ఎన్‌సిసి కో ఆర్డినేటర్ మైమూన్, వైస్ ప్రిన్సిపా ల్ డాక్టర్ వై శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి నారాయణ రాజు, అధ్యాపకులు డాక్టర్ శైలజ, డాక్టర్ గోవిందు సురేంద్ర, డాక్టర్ కోటేశ్వరరావు, శ్రీధర శర్మ , డాక్టర్ బి పీర్ కుమార్, రవిరాజు మాట్లాడుతూ చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సంప్రదాయ వస్త్రధారణతో వచ్చిన విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందించారు. అధ్యాపకులు కిరణ్మయి, భీమవరపు లక్ష్మి, కృపా కరుణ వాణి, డాక్టర్ విజయ మహేష్, హిమ బిందు, శ్రీలత, మీనాక్షి, సుందరమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందజేత

ప్రజాశక్తి-కోట: రైతులకు వివిధ రకాల విత్తనాలను మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం అందించారు. కోట మండలం సిద్ధవరం రైతు సేవ కేంద్రం పరిధిలో కొత్త పట్నం పంచాయతీలో మండల వ్యవసాయ అధికారి ఆర్ సుచంద్ర ప్రసాద్ నేతృత్వంలో మండల నాయకులు ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి ఆధ్వర్యంలో రైతులకు వివిధ రకాల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి, గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, కోట మండల వ్యవసాయ అధికారి సుచంద్ర ప్రసాద్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సి హెచ్‌వెంకట కృష్ణయ్య, ఫిషర్ డిపార్ట్మెంట్ రమేష్, పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి- వాకాడు: తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని నిడిగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో టీటీడీ శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో గురువారం ఉచిత మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు గురువారం నిర్వహించారు. చిత్రపటాల ద్వారా కేన్సర్ లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రెండు పింక్ బస్సుల ద్వారా కేన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమాలు వేగంగా నిర్వహిస్తున్నారు. పింక్ బస్‌లో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్ (మమోగ్రామ్), గర్భాశయ కేన్సర్ (పాప్ స్మియర్) స్క్రీనింగ్‌లు ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా పాల్గొన్నారు. అనుమానిత కేసులను స్విమ్స్‌లో చికిత్స కోసం తరలిస్తారు, అక్కడ కీమోథెరపీ, రేడియోథెరపీ అందిస్తారు. చికిత్స తర్వాత రోగులను పీహెచ్ సీ కి తిరిగి తీసుకొస్తారు. డాక్టర్ కె నాగరాజ్, డాక్టర్ టివిడి ప్రత్యూష, డాక్టర్ ఎం లలిత్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిడుగుర్తి వైద్య అధికారులు డాక్టర్ హేమ, డాక్టర్ శ్రవంతి, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, సర్పంచి నాగరాజు, స్థానిక నాయకులు సంపత్, అజిత్, సూపరువైజర్ సలోమి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిల్లల మానసిక ప్రవర్తనలో మార్పు రావాలి: శ్రీరామ్ బాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజంలోని పిల్లల మానసిక ప్రవర్తనలో మార్పు కోసం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని కృష్ణం వందే జగద్గురుం- 2025 కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు అన్నమయ్య డాన్స్ అకాడమీ నిర్వాహకులు, కూచిపూడి ఆర్టిస్ట్ శ్రీరామ్ బాబు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు తెలిపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు కానుందన్నారు. ఈ సమావేశంలో సరళ, కూచిపూడి ఆర్టిస్ట్ వినయ శ్రీ, లోకేశ్వరి, రేఖ పాల్గొన్నారు.

నేడు వరలక్ష్మీ వ్రతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థాన అనుబంధ దేవాలయమైన బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే భార్యాభర్తలకు పూజా సామగ్రి సిద్ధం చేశారు. అన్ని చర్యలు చేపట్టామని ఈవో బాపిరెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ రాష్ట్ర గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ , కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్‌ల సంయుక్త కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురువారం తమ విధులు నిర్వర్తిస్తూ నల్ల బ్యాడ్జిలు ధరించి శాంతియుత నిరసన చేపట్టారు. తాము ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న బదిలీలు, ఉద్యోగోన్న తులు, సహాయ ఆచార్యులుగా నామాంతరం, ప్రథమ సంవత్సర అడ్మిషన్లు వంటి న్యాయ పరమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా జిసిజిటిఎ అధ్యక్షులు నరసింహులు, రాష్ట్ర మహిళ విభాగం అధ్యక్షులు సుజన, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

సత్యవేడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సత్యవేడు డిగ్రీ కళాశాల అధ్యాపకులు కోరారు. జీసిటిఏ, జీసిఏ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలోనూ ఈ నెల ఏడో తేదీ నుండి 14 వ తేదీ వరకు ప్రభుత్వ కళాశాలలో బదిలీలు చేపట్టాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్, హేన, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్లకు సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న 50 మందికి పెళ్లకూరు మండల తహశీల్దారు హరికృష్ణ చేతుల మీదుగా ట్రస్ట్ ఆవరణలో గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సీఈఓ సీతారామ నాయుడు మాట్లాడుతూ మహిళా సాధికారత, స్వయం ఉపాధి లక్ష్యంగా గ్రామీణ మహిళలు, నిరుద్యోగ మహిళలకు నైపుణ్య శిక్షణ ఇప్పించి వారికి స్వయం ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలోని గ్రామీణ మహిళలు నిరుద్యోగ యువతీ,యువకులు , విద్యార్థినీవిద్యార్థులు ట్రస్ట్ ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. బ్యూటీషన్ నేర్చుకున్న మహిళలు తమ అనుభవాలను, చాగనం వారు మహిళలకు ఉచితంగా స్వయం ఉపాధియితీ ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల కోర్సులను ఉచితంగా నేర్పి ఉపాధి చూపిస్తున్నందుకు వారికి రుణపడి ఉన్నామని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో సీతారామ నాయుడు, కృష్ణాగల్లా, సర్వేయర్ సుప్రజ, వారి సిబ్బంది పాల్గొన్నారు.

తీర ప్రాంత సమస్యలు పరిష్కరించండి

తిరుపతి జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్‌కు వినతి

ప్రజాశక్తి - వాకాడు: తీర ప్రాంతంలో నెలకొన్న సమస్య లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తిరుపతి జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్‌ను స్థానిక రైతులు కోరారు. తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తీర ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించాలని తిరుపతి జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వివేక్‌ను గురువారం కలసి కోరారు. సమస్యలు వివరించి వినతి పత్రం సమర్పించారు. వాకాడు మండలంలో ఉన్న తీర ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల రోడ్లు, రవాణా అసౌకర్యాలు, విద్యుత్ సదుపాయం లేని గ్రామాలలో ప్రజల ఆవేదనలను తన పర్యవేక్షణలో వీక్షించి వారికి మెరుగైన వసతులను కల్పించే విధానాన్ని అధికారుల ద్వారా ప్రతిపాదించాలని కోరుకున్నారు. వాకాడు మండలంలో తీర ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ఎప్పటినుంచో రోడ్డు మార్గ రవాణా సదుపాయం, విద్యుత్ సదుపాయం ఆటంకాలకు గురిచేస్తూ వర్షాకాలంలో కనీసం రాకపోకల సదుపాయాలు అందడంలేదని అని ప్రజలు పేర్కొంటున్నారు. వీరి కష్టాలను అనేకసార్లు, ప్రజా నాయకుల ద్వారా ప్రభుత్వాలకు విన్నవించుకున్నా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ తీర ప్రాంత ప్రజలకు అండగా నిలిచి సమస్యలను పరిష్కరించే మార్గాలను ప్రభుత్వం తరపు నుంచి చేస్తామని హామీ ఇచ్చారు. కాని వాకాడు మండలంలో తీరప్రాంతం వైల్డ్ లైఫ్ భూభాగం ఎక్కువ ఉన్నందువల్ల అక్కడ జీవనాధారం చేసే ప్రజలకు రోడ్డు రవాణా, విద్యుత్తు వసతులు ఏర్పాటు చేయాలంటే ఇబ్బందికరంగా మారుతుందన్నారు.

అధికార పార్టీలో పదవుల కోసం కుమ్ములాటలు

ప్రజాశక్తి -నాయుడుపేట, ఓజిలి: పార్టీ నాయకత్వంలో తమకు సముచిత స్థానం ఇవ్వలేదని పార్టీ నాయకులు గొడవలకు దిగిన సంఘటన నాయుడుపేట పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం చోటు చేసుకుంది. నాయుడుపేట పట్టణంలోని శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలోని టిడిపి కార్యాలయంలో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మూడు మండలాలకు సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్టీ అబ్జర్వర్ జెడ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో మండల పార్టీ అభ్యర్థి ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓజిలి మండలం అభ్యర్థి పేర్లను ప్రతిపాదిస్తుండగా ఓజిలి మండల అభ్యర్థులు గొడవకు దిగారు. ఓజిలి మండలంలోని రెండు వర్గాలకు సంబంధించిన నాయకుల మధ్య మాటలతో ప్రారంభమైన వాగ్వివాదాలు, ముష్టి యుద్ధాలకు దారి తీశాయి. ఒక వర్గం నుండి ఓజిలి గ్రామానికి చెందిన కోటేశ్వరరావు అలియాస్ కోటి, మరో వర్గం వైపు ఓజిలి మండలం పెద్దపల్లి గ్రామం కాపురస్తుడు సుధాకర్ల మధ్య గొడవలు తారాస్థాయికి చేరాయి. ఎమ్మెల్యే విజయశ్రీ, అబ్జర్వర్ శివ ప్రసాద్ సమక్షం లోనే ఈ గొడవలు పెరిగి పెరిగి అభ్యర్థులను భయ భ్రాంతులకు గురి చేశాయి. ఎమ్మెల్యే అబ్జర్వర్ ఎంత సర్ది చెప్పినా ఈ గొడవ లు ఎంతకి తగ్గక పోవడంతో ఎమ్మెల్యే విజయశ్రీ తన గన్ మ్యాన్ సహాయంతో అక్కడి నుంచి వెళ్లి పోయారు. కొంత సమయం తర్వాత నాయుడుపేట పట్టణ సీఐ బాబి, ఎస్సై లు ఆదిలక్ష్మి, నాగరాజులు సమాచారం అందడంతో వెంటనే ఘటనా స్థలికి చేరుకుని ఈ వర్గాలను అదుపు చేసి గొడవలు కారణమైన కోటి సుధాకర్లను సిఐ అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. నెల రోజుల క్రితం అబ్జర్వర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా ఇదే వాతావరణం నెలకొనడంతో ఆయన వాయిదా వేసి వెళ్ళిపోయారు. మళ్లీ ఇప్పుడు అదే గొడవలు పునరావృతం కావడంతో ఓజీలి మండల అధ్యక్ష నియామకం వాయిదా పడింది.

రాత్రికి రాతే బస్సు షెల్టర్ కూల్చివేత

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) ప్రయాణికులు, బాటసారులు, వాహన చోదకులు సేద తీర్చుకునేందుకు ఆర్ అండ్ బి సంబంధించిన స్థలంలో గతంలో ప్రభుత్వం, దాతలు ఏర్పాటుచేసిన బస్సు షెల్టర్ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అడ్డంగా ఉందని, రాత్రికి రాత్రే భారీ యంత్రాలతో కూల్చి వేసిన సంఘటన బుధవారం రాత్రి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని తొండవాడ గ్రామంలో చోటుచేసుకుంది. చంద్రగిరి - తిరుపతి ప్రధాన రహదారిలో తొండవాడ మలుపు వద్ద గ్రామానికి చెందిన దాత ఇందుమౌలి రెడ్డి తన కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం బస్సు షెల్టర్ ను నిర్మించారు. ఆ బస్సు షెల్టర్ పక్కనే ఉన్న రియల్ వెంచర్కు అడ్డంగా ఉందని, ఆ బస్సు షెల్టర్ ను తొలగించి ఆ స్థలం ద్వారా ఆ వెంచర్ కు రోడ్డు ఏర్పాటు చేస్తే ప్లాట్లు ఎక్కువ రేటుకు అమ్ముకునేందుకు రియల్ ఎస్టేట్ బ్రోకర్లైన స్థానిక వైసీపీ నాయకుడు, సర్పంచ్ భర్త చంద్రమౌళి రెడ్డి, సిరిపిరెడ్డి దేవరాజు రెడ్డి, మల్లయ్య పల్లికి చెందిన చంద్రారెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి మరి కొంతమంది ఈ ఘటనలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. బస్ షెల్టర్, వందేళ్ళ వటవక్షాన్ని కూల్చివేతకు ఉపయోగించిన హిటాచిని, లారీని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆదాయం కోసం బస్సు షెల్టరును అక్రమంగా కూల్చి వేయడంతో గ్రామస్తు లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-నాయుడుపేట: విశ్రాంత ఉద్యోగుల సంఘం, రోటరీ క్లబ్ సంయుక్తంగా నాయుడుపేట మునిసిపల్ కార్మికులకు కమిషనర్ ఎస్ కె ఫజులుల్లా చేతుల మీదుగా గురువారం దుస్తులు పంపిణీ చేశారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉదయ్ శంకర్,రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగూరయ్య, రోటరీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన విశ్రాంతి ఉద్యోగుల సంఘం, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాయుడుపేటకు చెందిన నంద జగదీష్ కుమార్ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు సీతామహాలక్ష్మి ఎన్ఆర్ఐ విజయప్రభ, శ్రీనివాసులు రెడ్డి దంపతులు ఆర్థిక సాయంతో నాయుడుపేట మున్సిపాల్టీ పారిశుద్ధ్య కార్మికులకు, హిందూ శ్మశాన వాటిక సిబ్బందికి, విద్యుత్, పట్టణ నీటి సరఫరా కార్మికులు 250 మందికి సమ దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపాలిటీ కమిషనర్ ఫజులల్లా మాట్లాడుతూ నాయుడుపేట రోటరీ క్లబ్ నాయుడుపేటలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేశారని, పేద, వంటరి మహిళల ఆర్థిక అభివృద్ధి, వైద్యం,విద్యకి అనేక సహాయ సహకారాలు అందిస్తున్నారని ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వారిని కొనియాడారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆధవరం నాగూరయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులు లేని పట్టణాలను ఊహించుకోలేమని వారు చేసే పని అనన్య సామాన్యమని కరోనా సమయంలో అందరం ఇళ్లకే పరిమితమైతే ఈ కార్మికులు వారి ప్రాణాలకు సైతం తెగించి మనందరికీ సేవలు అందించిన గొప్ప వారిని అలాంటి వారికి ఈ కార్యక్రమం జరగటం తనకెంతో ఆనందకరంగా ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కాలేశా, కార్యదర్శి బట్ట సుబ్రహ్మణ్యం, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పెసల జయరాజ్ గోపాల్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉండాలి

ప్రజాశక్తి -కోట : రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఏటిఎమ్ ఏపీడీ పేర్కొన్నారు. కోట మండలంలోని గూడలి, తిన్నెలపూడి గ్రామాలలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ నెల్లూరు వారి ఆధ్వర్యంలో నూతన వరి వంగడాలపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా ఏ టి ఎమ్ ఏ పీడీ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడమే లక్ష్యమన్నారు. ప్రతి సీజన్లో వరి పంట పండించడం వల్ల అధిక లాభాలు పొందలేరని ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న వంటి పంటలు పండించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలుశిక్ష

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు ఇచ్చారు. టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా కోర్టులో విచారణ దశలో ఉన్న కేసులకు సంబంధించి పగడ్బందీ ఆధారాలను సేకరించి కోర్టు వారికి సమర్పిస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ వర్గాలు తెలిపాయి. తిరుపతి జిల్లా రామచంద్రపురం బీటు పరిధిలో నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసు క్రైమ్ నెంబర్ 145/2022 లో అరెస్టు అయిన వి షణ్ముగం నేరం రుజువు కావడంతో ఈ మేరకు న్యాయమూర్తి తీర్పును వెలువరించారన్నారు. న్యాయ స్థానం ఆదేశాల మేరకు నిందితుడిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం దుంగలు నరికి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన శిక్షలు తీసుకుంటామని హెచ్చరించారు.

కానిస్టేబుల్‌పై దాడి

కేసు నమోదు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఏఎస్ఐతో గొడవ పడ్డ వ్యక్తులను వాహనంలో స్టేషన్‌కు తీసుకెళుతుండగా తప్పించుకునే ప్రయత్నంలో కానిస్టేబుల్ పై దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు కథనం మేరకు గత నెల 30 తేది అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో లక్ష్మీపురం సర్కిల్ వద్ద గొడవ చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు ఏఎస్ఐ ఈశ్వరయ్యతో వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న నైట్ బీట్ 4లో ఉన్న కానిస్టేబుళ్లు ఫయాజ్, మనోజ్ అక్కడికి చేరుకొని ఏఎస్ఐతో గొడవ పడుతున్న వారిని పోలీస్ వ్యానులో స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. యువకులు గాంధీపురం స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం నుండి దూకి తప్పించుకునే ప్రయత్నం చేశారు. వారిని పట్టుకునేందుకు కానిస్టేబుల్ వెంబడించారు. వెనుకే వస్తున్న కానిస్టేబుల్ పై యువకు లు రాయితో దాడి చేశారు. ఈనెల 1న కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు, దర్యాప్తు చేపట్టారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కిమ్స్ ఆసుపత్రి ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ వి అభినయ రెడ్డి రాక

కిమ్స్ ఆస్పత్రి న్యూరాలజిస్ట్ వి అభినయ్‌రెడ్డి

ప్రజాశక్తి-కోట: నరాల వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ నెల 9వ తేదీ (శుక్రవారం) నిర్వహించ నున్న న్యూరాలజీ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోట జనతా క్లినిక్ డాక్టర్ జగదీష్, డాక్టర్ ఉమేరాలు తెలిపారు. కోట మండలంలోని స్థానిక జనతా క్లినిక్ ఆసుపత్రిలో గురువారం వారు మాట్లాడుతూ నెల్లూరు కిమ్స్ ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ జగదీష్, డాక్టర్ ఉమేరాలు హాజరవుతారని తెలిపారు. నరాలకు చెందిన బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం, మూర్ఛ వ్యాధి, మైగ్రేన్ తలనొప్పి సమస్యలు, తల తిరుగుడు, వణుకుడు, మతిమరుపు సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. మెదడులో కణితలు, కళ్ళు తిరగడం, నిద్ర సమస్యలు, సయాటికా, వెన్నుపూస నొప్పులు, కండరాల నొప్పులు, తదితర లాంటి నరాలకు చెందిన వ్యాధులుతో బాధపడేవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కోట ఎన్ సి ఆర్ నగర్ లోని జనతా క్లినిక్ ఆసుపత్రిలో నెల్లూరు కిమ్స్ ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ వి.అభినయ రెడ్డి అందుబాటులో ఉంటారని తెలిపారు. అపాయింట్‌మెంటు కోసం 9642414572, 9642414592 ఫోను నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నగర అభివృద్ధికి సమిష్టి కృషి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అధికారులు అందరూ సమన్వయంతో నగర అభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య సూచించారు. గురువారం నగరంలో అభివృద్ధి పనులు, పి4 సర్వే, పన్నుల వసూళ్ళు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై నగరపాలక సంస్థలో వివిధ విభాగాల అధికారులు, ఆన్లైన్ ద్వారా సచివాలయ సిబ్బందితో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ లోని అన్ని విభాగాల అధికారులు ఒకరినొకరు సమన్వయం చేసుకుని పనిచేయాలని అన్నారు. బంగారు కుటుంబాల ఎంపికై జరుగుతున్న పి4 సర్వే పారద ర్శకంగా నిర్వహించాలన్నారు. ఆయా వార్డుల్లో పారిశుద్ధ్య పనులను అందరూ కలసి మెరుగ్గా చేపట్టాలని అన్నారు. చెత్త కుప్పలు కనపడితే వెంటనే స్పందించి శుభ్రం చేయించే బాధ్యత ప్రతి ఒక్కరిదీ అన్నారు. ఎక్కడైతే ప్రజలు ఇబ్బంది పడు తున్నారో వారి సమస్య లను వెం టనే పరిష్క రించే లా శ్రద్ధ చూ పాల ని అన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పుట్టిన చంటి బిడ్డలకు గంట లోపు తల్లి ముర్రు పాలు బిడ్డకు ఇస్తే శ్రేష్టమ ని, వ్యాధి నిరోధక శక్తి టీకాగా ఉం టుం దని తిరుపతి జిల్లా పా ర్ల మె ం ట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి గురువారం పేర్కొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) SRIKALAHASTI
H.M.O.P.No.133/2024

Between
B.Venkateswarlu ....Petitioner
And
B. Padmavathi @ Y.Ashmitha ... Respondent

NOTICE TO THE RESPONDENT

To,
Billu Padmavathi @ Y.Ashmitha,
W/o B. Venkateswarlu, D/o Y. Nagaraju,
B.V. Puram Village, Gollapalli Post,
Srikalahasti Mandal.
Tirupati Dist.

Where as the above named petitioner has filed the above petition against you for grat of Divorce, the above said case is posted on 21-08-2025 for your appearance. Hence you please be present either in the person or through your Advocate on the said date at about 10.30 A.M before the said court or other wise the case will be decided as exparte in your absence.

P. DASARADHARAM REDDY, B. Com, L.LB.,
P. BHASKAR, B.A, L.L.B.,
P. AYYAPPA, M.Com, L.L.B.,
ADVOCATES, SRIKALAHASTI.

IN THE COURT OF THE HONORABLE SEVENTH ADDITIONAL DISTRICT JUDGE, GUDUR
E.P.No. 139 of 2019
O.S.No. 71 of 2014

(1) KURAPATI CHINNI RAGHUNATHA RAJU
(2) MUTYALA SRINIVASULU REDDY
- Petitioners / Decree Holders
Vs
(1) DEVARAPU SUNDARA RAMI REDDY
(died on 04-01-2018)
AND 04 OTHERS
- Respondents/Judgment Debtors

NOTICE

To
(5) DEVARAPU VARA PRASAD REDDY,
S/o **Sundara Rami Reddy,** Banigisahebpet,
East Gudur village GUDUR MANDALAM,
NELLORE DISTRICT.

Whereas the Petitioners herein preferred the above E.P.No.139 of 2019 in O.S.No.71 of 2014 on the file of this Honorable Court, for impleadment of you as Respondent No.5, you are hereby called upon to appear before the Honorable Court on **28-08-2025** either in person or through counsel by **10-30 a.m** on the said day and answer the claim, failing which the matter will be decided exparte.

P. RAGHU RAMI REDDY
Advocate for the Petitioners

ఉచిత విద్యుత్‌పై హర్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా సెలూన్ షాపు నిర్వహించుకుంటున్న నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జనసేన రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఆవులపాటి బుజ్జిబాబు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల తిరుపతి నగరంలో 50 మంది పేద నాయీ బ్రాహ్మణ సోదరులకు లబ్ధి చేకూరుతుందన్నారు. నాయి బ్రాహ్మణ కులవృత్తిని వేరొక కులానికి సంబంధించిన వారు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా ఈనెల 18న సైకిల్ తో జనసేన జనయాత్రను నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వినతి ఇస్తామన్నారు. నాయీ బ్రాహ్మణ కుల వృత్తిపై రాష్ట్ర ప్రభుత్వం పేటెంట్ హక్కును కల్పించేలా కృషి చేస్తామన్నారు. నాయీ బ్రాహ్మణుల సమస్యలను చట్టసభల్లో వినిపించడానికి శాసన మండల సభ్యత్వాన్ని నాయీ బ్రాహ్మణులకు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నాగరాజు, బాబు, రెడ్డయ్య, శ్రీనివాసులు, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడులో రాజకీయ పరిణామాలు మలుపు తిరుగుతోంది. నియోజవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా కూరపాటి శంకర్ రెడ్డి పగ్గాలు చేపట్టడంతో రాజకీయ సమీకరణలు వేగవంతంగా మారి టిడిపి మరింత బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా గురువారం తిరుపతిలో గ్రాండ్ రిడ్జ్ హోటల్లో టిడిపి జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్ అధ్యక్షతన టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా సత్యవేడు జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి దంపతులతో పాటు పలువురు సర్పంచులు, సోషల్ మీడియా కన్వీనర్లు, మాజీ సర్పంచులు, పలువురు వైసిపికి గుడ్ బై చెప్పి టిడిపిలో చేరారు. ఈ నేపథ్యంలో తొలుత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జెడ్పిటిసి విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి దంపతులను సాదరంగా టిడిపిలోకి ఆహ్వానించి ఆ పార్టీ కండువాను కప్పారు. అనంతరం ఆరూరు సర్పంచ్ అలిమేలు కమల్ పెద్దఈటిపాకం సర్పంచ్ రూబెన్, చిన్నఈటిపాకం సర్పంచ్ గోవిందస్వామి, అలిమేలు మంగాపురం సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి, వైసిపి నాయకుడు ఢిల్లీబాబు యాదవ్, దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి, మల్లవారిపాలెం ఈస్ట్ సర్పంచ్ పార్వతి సన్యాసయ్య, కాలమనాయుడుపేట మాజీ సర్పంచ్, వైసీపీ నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు గోవిందస్వామి, దాసుకుప్పం అడ్వకేట్ నాగరాజు, పేరడం కిష్టయ్య, వైసిపి సత్యవేడు నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ శ్యాంప్రసాద్ రెడ్డి, సురుటపల్లి మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు మునివేలు, సత్యవేడు పట్టణం మూడవ సచివాలయ వైసీపీ కన్వీనర్ మునికుమార్ తదితర ముఖ్య నాయకులు వారి వారి అనుచరులకు ఆ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా వైసీపీ జెడ్పిటిసి కొనసాగిన విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి ఆ పార్టీకి గుడ్ బై చెప్పి టిడిపిలోకి చేరిన నేపథ్యంలో మండలంలోని పలు పంచాయతీల్లో వైసిపి చతికిలబడే అవకాశాలు లేకపోలేదు. ముఖ్యంగా అలిమేలు మంగాపురం పంచాయతీలో గతంలో టిడిపి, వైసిపి ఢీ అంటే ఢీ అనే రీతిలో పరిణామాలు కొనసాగింది. అది నేడు తలకిందులైంది. గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి వైసీపీని వీడి టిడిపిలో చేరడంతో అక్కడ వైసిపికి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఏఎం పురంలో సర్పంచ్ వారి అనుచరులు టిడిపి తీర్థం పుచ్చుకోవడం అక్కడ కొంతమంది టిడిపి నాయకులకు మింగుడు పడని పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనా మరికొన్ని పంచాయతీలో కూడా వైసీపీ నుంచి టిడిపిలోకి వలసలు పెరిగే అవకాశాలు లేకపోలేదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ టిడిపి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా శంకర్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేయడంతో ముున్ముందు టిడిపి మరింత బలపడే అవకాశాలు ఉందనే చెప్పాలి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, టిడిపి మండలాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు పరమశివం, మండల నాయకుడు మురళి(చికెన్ చిన్న) పాల్గొన్నారు.

జిల్లా ఇన్ఛార్జి మంత్రి సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

‘ ప్లేస్‌మెంటు ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి’

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్ మెంట్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఎన్ఎల్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు సుందరరాజు ఆధ్వర్యం లో వర్సిటీ రిజిస్ట్రార్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ డిపార్టుమెంట్లలో ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసుకుని వివిధ కంపెనీల్లో ఉద్యోగం వచ్చిన విద్యార్థులు నుండి మూడు నుంచి పదివేల వరకు ప్రతి విద్యార్థి నుండి వసూలు చేశారని ఆరోపించారు. ఈ డబ్బు ఎస్వీ యూనివర్సిటీ అకౌంట్‌కి గాని ఇంజినీరింగ్ కళాశాలకు అనుబంధంగా ఉన్న అకౌంట్లలో డబ్బులు వేయించకుండా ప్లేస్‌మెంటు ఆఫీసర్ అకౌంట్లో విద్యార్థులతో కట్టించుకొని ఆ డబ్బు ఎంత వాడుకున్నారు? ఏ అమౌంట్ దేనికి ఖర్చు చేశారని వివరాలు యూనివర్సిటీకి కాని ఇంజనీరింగ్ కళాశాలకు కాని తెలుప కుండా గత ఐదు సంవత్సరాల నుండి ఆడిట్ కూడా చేయకుండా డబ్బులను విచ్చలవిడిగా ఉపయోగించారని ఆక్రోశం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించేందుకు కమిటీని వేసి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎంఎస్‌విఐ జిల్లా అధ్యక్షులు బాలాజీ, ఎన్ ఎల్ ఎస్ ఎ జిల్లా అధ్యక్షులు ముఖేష్, కార్యదర్శి ప్రకాష్, కుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రారుకు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక ఔషధం

రామచంద్రపురం(చంద్రగిరి): తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక ఔషధం లాగా పనిచేస్తాయని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజీ, కమ్యూనిటీ మెడిసిన్, హెచ్ఓడి డాక్టర్ సునీత అన్నారు. సునితా అధ్యక్షతన గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఐ యుగంధర్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలుపై అవగాహన సదసు, భారీర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యుగంధర్ , కమ్యూనిటీ మెడిసిన్ డిపార్టుమెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివ కళ, డాక్టర్ దయాకర్, డాక్టర్ హేమచంద్ర, డాక్టర్ హేమలత, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మధుసూదన రావు, డాక్టర్ సౌమ్య ప్రియ, డాక్టర్ రేవతి,పిజి డాక్టర్లు వినాయక హరితేజ, కీర్తి, కేతన, వైష్ణవి మేఘ, మెడిసిన్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్లు 3, 13 సంయుక్తంగా తల్లిపాల వారోత్స వాలను పురస్కరించుకొని కుంట్రపాకం గ్రామంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం అధికారిణులు డాక్టర్ నీరజ, డాక్టర్ సుజాత, సర్పంచ్ శుభా పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ తన పంచాయతీ లోని బాలింతలు , బిడ్డకు విధిగా తల్లి పాలు పట్టించి, తల్లీ, బిడ్డా ఆరోగ్యంగా ఉండేలా అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘమిత్ర చెంచులక్ష్మి, 40 మంది బాలింతలు, గర్భవతులు, స్వయం సహాయక బృంద మహిళలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

బిపి మండల్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మండల్ డే సందర్భంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పనకు కృషి చేసిన బిందేశ్వరీ ప్రసాద్ మండల్ (బీపీ మండల్)కి డీసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వంకిపురం పవన్ గజమాలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఆగష్టు 7న మండల్ డేని పురస్కరించుకొని బీపీ ఘనంగా నివాళులర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, కేశవులు, దేవరాజులు, తిరుమల కళ్యాణకట్ట అధ్యక్షులు కొప్పర్తి శివ, గుణశేఖర్, భాను ప్రకాష్, వెంకటేష్, శ్రీనివాసులు, మునీంద్ర పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని ద్వారా డాక్టర్ జనార్ధన్ రెడ్డి , డాక్టర్ రోహిణి సంపూర్ణ సహాయ సహకారాలతో ఎయిడ్స్ బాధితులు 30 మందికి గురువారం పౌష్టిక ఆహారం అందించారు. బాధితులకు సాయం అందిస్తున్న ప్రగతి సేవా సంస్థ కి లైఫ్ టైం ప్రాజెక్ట్ కి సహకరిస్తున్న డాక్టర్ జనార్ధన్ రెడ్డి ,డాక్టర్ రోహిణి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ స్వాతి, సెక్రటరీ జి చంద్రశేఖర్, ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, డివిఎంసి సభ్యులు వెంకటేశ్వరరావు, కెఆర్ఎం, రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్, తూపిలి యశ్వంత్, డిష్ నాగరాజు, శ్యామ్, కుమార్ నాయుడు పాల్గొన్నారు.

మా గోవులు అప్పగించండి

బాధితురాలు అభ్యర్థన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత ఐదేళ్ల కాలంలో తాను మేపు కుంటున్న తన గోవులను దొంగ తనంగా ఎత్తుకెళ్లారని, తిరిగి ఆ గోవులను తనకు అప్పగించాలని కోరుతూ మంగళం పరిధి తిరుమల నగర్ గ్రామపంచాయతీకి చెందిన బాధితురాలు లక్ష్మీ అభ్యర్థించారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ధనంజయ నాయుడు అనే వ్యక్తి ఆవులను దొంగతనంగా తీసుకెళ్లి అమ్మేసేవాడని, ఆ వచ్చిన ధనాన్ని స్థానిక నాయకులకు వాటాలు ఇచ్చేవాడని ఆరోపించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని, అయితే పోలీసులు తనకు చెందిన 13 ఆవులను పెద్ద మనుషుల సమక్షంలో అప్పగించినట్లుగా తప్పుడు నివేదికను ఉన్నతాధికారులకు పంపించాలన్నారు. ఆవుల దొంగతనం విషయమై రాష్ట్ర హోంమంత్రి అనితను కలసి తన ఆవేదనను చెప్పుకున్నాం అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తనకు జీవనాధారమైన ఆవులను ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నానన్నారు.

ఘనంగా స్వామినాథన్ జయంతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆహార లోటు దేశం నుంచి అధిక ఆహార ఉత్పత్తి దేశంగా భారతదేశ మారడానికి ప్రధానమైన కారణం ఎంఎస్ స్వామినాథన్ అని డాక్టర్ చంద్రమౌళి అన్నా రు. గురువారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎంఎస్ స్వామినాథన్ జయంతి వేడుక లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ అధ్యక్షులు డాక్టర్ జై కోటేశ్వరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి సుజన, టి నరసింహులు, జయప్రద అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.